క్లుప్తంగా

ముమ్మరంగా గండ్లు పూడ్చివేత పనులు



సాక్షి స్పందన

నున్న(విజయవాడరూరల్): వరదల కారణంగా నున్న- నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డులో వరదనీరు కింది ప్రాంతాలకు వెళ్లేందుకు అధికారులు పెట్టిన గండ్లను శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చివేసే పనులు చేపట్టారు. 'గండ్లు పూడ్చండి మహాప్రభో' అంటూ 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు గండ్లు పూడ్చే పనులను పొక్లెయిన్‌తో నిర్వహిస్తున్నారు. రోడ్డు కింది భాగంలో సిమెంటు తూములు ఏర్పాటు చేసి అవి కదలకుండా సిమెంటు కాంక్రీట్ వేసి గండ్లు పూడ్చివేస్తున్నారు. వరదలు పూర్తిగా తగ్గిపోయినా గండ్లు పూడ్చటంలో అధికారులు ఆలస్యం చేయడంతో ప్రజల రాకపోకలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రజల సమస్యను గుర్తించిన సాక్షి దినపత్రిక ప్రజల పక్షాన వుండి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించి రోడ్డుపై గండ్లు పూడ్చివేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలిపారు. పెనమలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా గ్రామంలో పెద్దగుడి సెంటర్, కోయావారి వీధి, పాత, కొత్త ఎస్సీ ఏరియా, బీఆర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



పెనమలూరు: గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో శుక్రవారం పెనమలూరు నియోజకవర్గంలో ఉన్న అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో బదిలీ పై వచ్చిన అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీ ప్రసాద్, మూడు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్




కంకిపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను కంకిపాడు పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలో ఇసుక క్వారీ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై దాడి చేయగా, ఇసుక లోడుతో వెళ్తున్న ఐదు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లు, ఇసుకను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పెనమలూరు: మండల ఎంపీడీవోగా బి.ప్రణవి శుక్రవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన సునీతాశర్మ ఇబ్రహీంపట్నంకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఏలూరు రూరల్ నుంచి ప్రణవి వచ్చి పెనమలూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్‌లో బదిలీ అయిన వారి స్థానాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులందరూ విధుల్లో చేరారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా కోర్టు సెంటర్‌లో కూరగాయలు, మొక్కజొన్న పొత్తులు విక్రయించే ఇరువురు చిరు వ్యాపారులకు విజయవాడ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు చందన వెంకట్ శుక్రవారం తోపుడు బండ్లను అందజేశారు. స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లో వ్యాపారాలు చేస్తున్న బాదర్ల వెంకటేశ్వర్లు, షేక్ రసూల్‌బీలకు వీటిని అందజేశారు.

ఉచిత ఇసుక ఇవ్వాలని ధర్నా

- కేజీల చొప్పున ఇసుక అమ్మి నిరసన తెలిపిన కార్మికులు
- 100 రోజులకు పైగా గడిచినా గుప్పెడు ఇసుక ఉచితంగా ఇవ్వలేదని విమర్శ
- కుంటుపడుతున్న భవన నిర్మాణ రంగం
- ఇసుక మాఫియాను అరికట్టాలని డిమాండ్
- పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో భవన నిర్మాణ రంగ కార్మికుల నిరసన



గన్నవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

పెనమలూరు: ఉచిత ఇసుక పాలసీ అంటూ ప్రచారం చేశారు. కానీ వాస్తవంలో ఉచితమనే మాటే లేదు. అధిక ధరలకు విక్రయిస్తున్నారని నేతలు ఆరోపించారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఇసుకను ఉచితంగా ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక ఇవ్వాలని కోరుతూ మండల సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. పోరంకి సెంటర్‌లో కేజీ చొప్పున ఇసుక అమ్మకాలు చేసి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం వచ్చి 100 రోజులకు పైగా గడుస్తున్నా గుప్పెడు ఇసుక ఉచితంగా ఇవ్వలేదని విమర్శించారు. టీడీపీ నేతల సహకారంతో ఇసుక మాఫియా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి అధిక ధరలకు విక్రస్తున్నారని ఆరోపించారు. ఇసుక అందుబాటులో లేక పోవటంతో భవన నిర్మాణ రంగం కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉచిత ఇసుక ఇచ్చి ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పుసునూరి పాతాళలక్ష్మి, షేక్ కాశిం, షేక్ మస్తాన్‌వలి, పసులూరి లక్ష్మీనారాయణ, అమరయ్యశాస్త్రి, పండమనేని శ్రీనివాసరావు, పలువురు పాల్గొన్నారు.

గన్నవరం: ఎన్నికల హామీకి కట్టుబడి ఉచిత ఇసుక పాలసీని టీడీపీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లం మాట్లాడుతూ..గత కొన్ని రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయిన కారణంగా భవన నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇసుక క్వారీలను తెరవడంతో పాటు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, సురగాని సాంబశివరావు, గుండిమేడ ఉదయభాస్కర్, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలి

కంకిపాడు: ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. కంకిపాడు సెంటరులో భవన నిర్మాణ కార్మికులు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. తాడంకి నరేష్ మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికల్లో విజయం కోసం ఉచిత ఇసుక విధానం హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకూ ఉచిత ఇసుక అందుబాటులో లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కరువై ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళారుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నేత వక్కలగడ్డ శివశంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు మద్దసాని మాధవరావు, ఎం.చిన్నకొండయ్య, ఎం.మాల్యాద్రి, వరాలు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్ డిమాండ్‌చేశారు. ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నిరసన చేపట్టారు. రాజేష్ మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీని అమలుచేయకపోవటంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ ప్రతినిధులు సిద్దినేని ప్రసాద్, మస్తాన్, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలి

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం అందరికి ఉచితంగా ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుకను అందించి, భవన నిర్మాణ కార్మికులను, చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఉంగుటూరు ప్రధాన కూడలి వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి మండల కేంద్రాల్లో నిరసన తెలుపుతున్నామని చెప్పారు. ఇసుక సరఫరా ద్వారా నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి, పిల్లి రాజారావు, వెన్నూతల గ్రామ సర్పంచ్ రామ్మోహన్‌రావు, సీఐటీయూ మండల కార్యదర్శి రామరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు సంతోష్ కుమార్, సుభాని, వెంకటేశ్వరరావు, అనిల్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని సీపీఎం, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్‌లో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక రీచ్‌లను పూర్తి స్థాయిలో తెరవకపోవటంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు వడ్డి గిరి, రైతు సంఘం మండల అధ్యక్షుడు తోట సాంబశివరావు పాల్గొన్నారు.



కంకిపాడు సెంటరులో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



ఉంగుటూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం, భవన నిర్మాణ సంఘ నాయకులు



ఉయ్యూరులో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నీటి వనరులను సక్రమంగా వినియోగించాలి

మాజీ ఎమ్మెల్యే రత్నబోస్

గన్నవరం: నియోజకవర్గంలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మెట్ట ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం గతంలో ఎస్ఎస్‌పీ కాలువలు నిర్మించినట్లు చెప్పారు. వీటిద్వారా నాగర్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా ఏడాదికి రెండు సార్లు విడుదలయ్యే నీటితో చెరువులకు మళ్లించడం జరిగేదని తెలిపారు. కేసరపల్లి, ముస్తాబాద, చిన్నఆవుటపల్లి తదితర గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి నీటిని అందించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం వీటిని పూడ్చివేయడం, నిరుపయోగంగా మారడం వల్ల నీటి ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోలవరం కాలువకు తూములు ఏర్పాటు చేసి గతంలో ఉన్న ఎస్ఎస్‌పీ కాలువల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరారు. దీనివల్ల సాగు, తాగునీటి కష్టాలు తీరడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని తెలిపారు.

ఆకట్టుకున్న తాళ భజన పోటీలు



చిట్టూర్పు(ఘంటసాల): మండలంలోని చిట్టూర్పు గ్రామంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళ భజన పోటీలు రెండో రోజు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిట్టూర్పు గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయ (శివాలయం) ప్రాంగణంలో జరిగిన పోటీల్లో వక్కలగడ్డ గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర భజన సమాజం, పూషడంకు చెందిన శ్రీ రామాంజనేయ భజన సమాజం, కోడూరుకు చెందిన హిందూ ధర్మ భజన సమాజం, పెడనకు చెందిన సదాశివలింగేశ్వర భజన సమాజం, వీరవల్లి గ్రామానికి చెందిన గీతా కృష్ణ భజన సమాజం భక్త సమాజాలు పాల్గొని భక్తి గీతాలను శాస్త్రోక్తంగా, లయబద్ధంగా ఆలపించారు. న్యాయనిర్ణేతలుగా పాడుగు ప్రభాకరరావు, ఏసుపాదం వ్యవహరించారు. అనంతరం భజన పోటీల నిర్వాహక కమిటీ సభ్యుడు గుత్తికొండ వరప్రసాద్‌ను కోడూరుకు చెందిన విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, నిర్వాహక కమిటీ సభ్యులు వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీమాతా.. నమోస్తుతే!



ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో గాయత్రీదేవిగా అమ్మవారు



యనమలకుదురులో గాయత్రీదేవిగా అమ్మవారు



దావాజిగూడెం రామాలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణ



యనమలకుదురులో బ్రహ్మచారిణిగా అమ్మవారు

- రెండో రోజు దేవీ శరన్నవరాత్రులు
- మందిరాల్లో కొనసాగుతున్న పూజలు

కంకిపాడు: గాయత్రీమాతా నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. దేవీ శరన్నవరాత్రుల్లో రెండో రోజైన శుక్రవారం దుర్గాదేవి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు శివాలయం, గాయత్రీవిహార్‌లోని ధ్యానయోగ సాయి మందిరంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తుల పూజలందుకున్నారు. కంకిపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపం, శివాలయం, ఉప్పలూరు, మంతెన గ్రామాల్లో దేవీశరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి.

గన్నవరం: శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గూడపాటి త్రివేది-దుర్గారాణి, కంభంపాటి రాజేష్-జ్యోతి దంపతులచే శ్రీగాయత్రీదేవికి పూజలు చేశారు. తొలుత సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక శ్రీగాయత్రీ అమ్మవారి మందిరంలో గాయత్రీహోమం నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీసంతానలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సువాసినీలచే కుంకుమార్చనలు, శ్రీలలితా సహస్రనామ స్తోత్ర పారాయణం జరిపారు. స్థానిక యాదవుల రామాలయంలో శ్రీగాయత్రీదేవికి పూజలు చేశారు. బుద్దవరం, అల్లాపురం, కేసరపల్లిలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఉయ్యూరు: దేవీ శరన్నవరాత్రుల్లో రెండో రోజైన శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదమాతకు భక్తులు విశేష పూజా కార్యక్రమాలు జరిపించి తన్మయత్వం చెందారు. ఉయ్యూరు పట్టణంలోని శ్రీ విజయ దుర్గా భవానీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శివాలయంలో శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. మండలంలోని పెద ఓగిరాల, ముదునూరు, కాటూరు, చిన ఓగిరాల గ్రామాల్లోని ఆలయాల్లో దుర్గానవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీదేవిగా పూల అలంకరణను దాతల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం సహస్ర నామ కుంకుమార్చన, చండీ హోమాలను నిర్వహించారు. సాయంత్రం నీరాజనం మంత్రపుష్పం, పంచహారతులను భక్తిశ్రద్ధలతో చేశారు. సాయంత్రం నిర్వహించిన శ్రీవెంకమ్మ తల్లి మురళీకృష్ణ కోలాటం, యడం నరేంద్రకుమార్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ వద్ద ఏర్పాట్లను ఈవో పి.ప్రియాంక పర్యవేక్షించారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కొండపై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శ్రీ బ్రహ్మచారిణిదేవిగా అలంకరించారు. అమ్మవారికి విశేష అర్చనలు చేశారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో లాకుల సెంటర్‌లో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో, పోరంకి శ్రీనగర్‌కాలనీలో శ్రీకోందండ రామాలయంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఐలూరి నాగభూషణశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నున్న(విజయవాడరూరల్): దసరా మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం బోడపాడు గ్రామంలోని శ్రీగంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు భక్తులకు శ్రీగాయత్రీదేవిగా దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది. చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి దర్శనమిచ్చారు. అమ్మవారికి అలంకారములు అర్చనలు చండీ పారాయణలు, శ్రీమహావిద్య పారాయణలు, చండీ శ్రీ మహావిద్యా హోమములు, కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి ఆలయం అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి గాయత్రీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో కనక దుర్గమ్మ శ్రీ గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. పురుషోత్తపట్నం శివాలయం, శ్రీ భువనేశ్వరీ మాత ఆలయం, చిక్కవరం కోదండ రామాలయం, శ్రీక్షేత్ర హనుమత్పురం తదితర ఆలయాల్లో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సకల మంత్రాలకు మూలమైన శక్తిగా, వేద మాతగా పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన దేవత గాయత్రీదేవి అని అర్చకులు కొండవీటి మురళీధరశర్మ, కొండవీటి హరిశ్చంద్రప్రసాద్ భక్తులకు అభిభాషణం చేశారు. చిక్కవరం క్షేత్ర హనుమత్పురంలో మంగళ గౌరీదేవిగా అలంకరించి బాల పూజలు, సువాసిని పూజలు నిర్వహించారు.



ఉయ్యూరు శివాలయంలో బాలాత్రిపుర సుందరీదేవిగా..



ఉయ్యూరు విజయ దుర్గాభవానీదేవి ఆలయంలో..



రామవరప్పాడులో శ్రీగాయత్రీ దేవిగా పేరంటాలమ్మ



ప్రొద్దుటూరు శివాలయంలో గాయత్రీదేవిగా కాశీఅన్నపూర్ణాదేవి

వీఆర్‌లో రీసెర్చ్ కాంక్లేవ్ పోస్టర్ ఆవిష్కరణ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో శుక్రవారం రీసెర్చ్ కాంక్లేవ్- 2025 పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనవరి 24, 25వ తేదీల్లో రీసెర్చ్ కాంక్లేవ్ నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ వివరాలు తెలుపుతూ ఇండస్ట్రీ అకడమిక్ మీట్, హ్యాక్‌థాన్, జర్నల్స్ పబ్లికేషన్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు ఇస్తామన్నారు. కొత్తగా ప్రారంభించిన వెబ్‌సైట్ కీలక వనరుగా పని చేస్తుందని, రిజిస్ట్రేషన్, పేపర్ సమర్పణ, ఇతర విలువైన సమాచారం ఇస్తుందన్నారు. వైస్ చాన్సలర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రీసెర్చ్ కాంక్లేవ్- 2025 ద్వారా విద్యార్థులకు వినూత్న ఆలోచనలు ప్రేరేపించటానికి పరిశోధనలు, అభివృద్ధికి వేదికగా ఉపయోగపడుతుందని వివరించారు. విద్యావంతులు, పారిశ్రామిక వేత్తల మధ్య సహకారం బలోపేతం చేయటానికి ఉపయోగపడుతుందన్నారు. డీన్ బావినేని పాండురంగారావు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎం.సునీత, రిజిస్ట్రార్ డాక్టర్ రవిచంద్, పలువురు పాల్గొన్నారు.



కానూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్



ఇంద్రకీలాద్రిపై శుక్రవారం అమ్మవారిని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దర్శించుకున్నారు. పూజలు చేశారు.

హోంలో బాలురకు ఉచిత న్యాయ సేవలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జువెనైల్ హోంలోని బాలురకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య చెప్పారు. కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాన్ని (జువెనైల్ హోమ్) రామకృష్ణయ్య శుక్రవారం సందర్శించారు. రికార్డ్స్‌ను పరిశీలించి బాలురతో సంభాషించారు. హోంలో సౌకర్యాలతోపాటు వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేని బాలు రకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే కొందరు పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడటం, నేరాలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. హోంలోని పిల్లలు ఆన్‌లైన్ ద్వారా చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్నా రని తెలుసుకుని అభినందించారు. పిల్లలు ఇండోర్ గేమ్స్‌లో పాల్గొని రాణించాలని సూచించారు. అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి యువకుడి మృతి

పెనమలూరు: తాడిగడప చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.... తాడిగడప వినాయకుడి గుడి వద్ద మట్టా అంకినీడు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను ఆటోనగర్‌లో పని చేస్తాడు. అంకినీడుకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు మోహన్ కృష్ణ (23) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివి పోరంకిలోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి మోహన్‌కృష్ణ సిగరెట్ తాగటానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఫోన్ పని చేయలేదు. కాగా 3వ తేదీ రాత్రి మోహన్‌కృష్ణ మిత్రులు సందీప్, శివాజీ మోహన్‌కృష్ణ ఇంటికి వచ్చి చెరువులో మృతదేహం ఉందని చెప్పారు.

చెరువు నుంచి శవాన్ని బయటకు తీసు చూడగా అది మోహన్‌కృష్ణ మృతదేహమేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ ఘటన పై తండ్రి అంకినీడు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ ప్రమాదవశాత్తు తన కుమారుడు చెరువులో పడి మృతి చెందాడన్నారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com